తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## విద్యతోపాటు వ్యక్తిత్వ వికాసం పెంచుకోవాలి

**- బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మలత**



శాంతిపురం, జూన్ 18 ప్రభాతవార్త

విద్యార్థులు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యురాలు వెంకట పద్మలత సూచించారు. గురువారం కడపల్లి కస్తూరిబా గురుకులం పాఠశాలను ఆమె సందర్శించారు. ఈసందర్భంగా బాలికలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బాలల హక్కులు, బాలికా విద్య ప్రాముఖ్యత, రక్షణ, భద్రత, సంక్షేమం తదితర అంశాలపై వివరించారు. పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలు, వసతి, భోజనం, ఇతర మౌలిక వసతులపై విద్యార్థినులతో నేరుగా మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. బాలికల అభివృద్ధి, భద్రత, హక్కుల పరిరక్షణకు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలోఎంఇఒలు సెల్వ పాండియన్, చంద్రమ్మ,హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాఠశాల విలీన ప్రక్రియను ఆపండి.!

**అరిగెలవారిపల్లిలో పాఠశాల ఎదుట గ్రామస్థుల ఆందోళన**



చంద్రగిరి, జూన్ 18 ప్రభాతవార్త:

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విలీన ప్రక్రియను వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ పనపాకం పంచాయతీ, అరిగెల వారిపల్లిలోని పాఠశాల ఎదుట గురువారం పేరెంట్స్ ఆందోళన చేపట్టారు. 2025-26 విద్యా సంవత్సరంలో కొన్ని పాఠశాలలను (3, 4, 5 తరగతులను) సమీప హైస్కూల్లో విలీనం చేశారు. ఈ నేపథ్యంలో తమ పిల్లలు గ్రామంలోని స్కూల్‌కు కాకుండా దూరంగా వున్న హైస్కూల్‌కు వెళ్ళవలసిరావడం పట్ల ఆందోళనకు దిగారు. 300 కుటుంబాలు కలిగిన మా గ్రామంలో ప్రాథమిక పాఠశాలను కొనసాగించాల్సిందేనని డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. ఎంఈఓ -2 భాస్కర్‌బాబును వివరణ కోరగా డిఈఓ ద్వారా కమీషనర్‌కు అభ్యర్థన పంపడం జరిగిందన్నారు. ఆ మేరకు వారి నుండి ఉత్తర్వులు అందవలసివుందన్నారు.

### నీట్ పునఃపరీక్షకు

# పగడ్బందీ ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు**



తిరుపతి కలెక్టరేట్, జూన్ 18 ప్రభాతవార్త :

జిల్లాలో ఈ నెల 21న నిర్వహించనున్న నీట్ పునఃపరీక్షను ఎలాంటి లోపాలకు తావులేకుండా పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నీట్ పునఃపరీక్ష నిర్వహణపై జిల్లా కలెక్టర్ ఎస్పీ సుబ్బరాయుడు, నగర పాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ శారదా దేవి, డి ఆర్ ఓ నరసింహులు, లైజన్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21న నిర్వహించనున్న నీట్ పునఃపరీక్షను ఎలాంటి లోపాలకు తావులేకుండా పగడ్బందీగా నిర్వహించాలని, పరీక్ష నిర్వహణలో పాల్గొనే అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అభ్యర్థులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి ఉండదన్నారు.. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, హాల్ టికెట్‌తో పాటు చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డును తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు.ఈ పరీక్షలకు జిల్లాలోని తొమ్మిది కేంద్రాలలో 4556 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2:00 గంటల నుండి 5:15 వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్ష సమయానికి ఉదయం 11 గంటలకు రిపోర్టింగ్ సమయానికి అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అభ్యర్థుల సీటింగ్ అరేంజ్మెంట్స్ కరెక్ట్‌గా ఉండేలా చూడాలన్నారు.ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించనున్న నీట్ పునఃపరీక్షను ప్రశాంతంగా పారదర్శకంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాటులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, పరీక్షా కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వివరాలు

తిరుపతి నగరంలోని 1.పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ , ఇస్కాన్ టెంపుల్, అలిపిరి, 2.ఎస్వియు క్యాంపు స్కూల్, బాలాజీ కాలనీ, 3.ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కాలేజ్, లక్ష్మీపురం సర్కిల్, 4.ఎస్ జి ఎస్ హై స్కూల్, భవాని నగర్, 5.శ్రీపద్మావతి గర్ల్స్ హై స్కూల్, బాలాజీ కాలనీ, 6.శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, పద్మావతి నగర్, 7.ఎస్వి జూనియర్ కాలేజ్, ఇస్కాన్ టెంపుల్, 8.ఎస్ వి ఆర్ట్స్ కాలేజ్ వింగ్ ఎ, బాలాజీ కాలనీ, 9. ఎస్ వి ఆర్ట్స్ కాలేజ్ వింగ్ బి, బాలాజీ కాలనీ తిరుపతిలలో నిర్వహిస్తారు.

# పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ

**ఎస్ఐఆర్‌పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు**
**విలేకరుల సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్**



చిత్తూరు, జూన్ 18 ప్రభాతవార్త:

జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పారదర్శకత, నిష్పాక్షికతతో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు తీరుపై విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్ధేశించిన మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఓటరు జాబితా ప్రక్షాళన, గృహసర్వే, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయన్నారు. జిల్లాలో ప్రతి ఇంటిని బూత్ లెవల్ అధికారులు(బిఎల్ఓ)లు సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తున్నారని, ప్రస్తుతం మొదటి దశలో ఇంటింటి సర్వే, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియలు జరుగుతున్నాయని, ఈ ప్రక్రియ జులై 14వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకోవాలనుకునే వారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, మృతి చెందిన లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్ల తొలగింపుకు ఫారం-7, చిరునామా, వయస్సు, పేరులో మార్పులు వంటి సవరణల కోసం ఫారం-8ను వినియోగించుకోవచ్చునన్నారు. అలాగే జులై 21వ తేదీ ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నామన్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల్లో నివసిస్తున్న ఓటర్లు సైతం అవసరమైన ధృవీకరణ పత్రాలతో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చునన్నారు. అలాగే ద్వంద ఓటర్ల గుర్తింపు, మృతి చెందిన వారి పేర్ల తొలగింపు, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు ద్వారా ఓటరు జాబితాను మరింత కచ్చితంగా రూపొందిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పిస్తున్నామని, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించినట్లు కలెక్టర్ చెప్పారు. అలాగే బూత్ లెవల్ ఏజెంట్లు(బిఎల్ఎ)లు సైతం అవసరమైన సమాచారంను పొందేలా చర్యలు తీసుకున్నామని, రాజకీయ పార్టీల సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. బిఎల్‌ఓలు రాజకీయాలకు అతీతంగా నిష్పాక్షపాతంగా విధులు నిర్వహించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, ప్రతి రోజు ఇఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, తహసిల్దార్లు బిఎల్‌ఓలతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారన్నారు.జిల్లాలో ప్రస్తుతం సుమారు 80 శాతం వకు ప్రతి ఓటరుకు ఫారం-2 పంపిణీ చేయాలని, సర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించి, ఫారాలు నింపి బిఎల్‌ఓలకు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఓటరు మ్యాపింగ్ మొత్తం 2002 ఓటరు జాబితా ఆధారంగానే జరుగుతున్నదని, కావున 2002 ఓటరు జాబితా అందరికి అందుబాటులో వుంటుందని, దీని ద్వారా ఓటరు వివరాలు తెలుసుకుని ప్రస్తుత ఓటరు వివరాలతో ఫారం నింపి అందజేయాలన్నారు. అలాగే 2002 సంవత్సరం అనంతరం ఓటరుగా నమోదు అయిన వారు 2002 ఓటరు జాబితాలో తండ్రి లేదా తల్లి పేరు, సీనియల్ నెంబర్ తెలుసుకుని వివరాలను బూత్ లెవల్ అధికారులు అందించాలన్నారు. 2002 ఓటరు జాబితా మ్యాపింగ్ పూర్తి చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మిగిలిన ఓటర్ల వివరాలను సైతం త్వరలో అనుసంధానం చేయనున్నామని, 2002 ఓటరు జాబితాలో పేరు లేకపోయినా టెన్త్ క్లాస్ సర్టిఫికేట్, జనన ధృవీకరణపత్రం, పెన్షన్ ధృవీకరణ పత్రం తదితర ఎన్నికల సంఘం గుర్తించిన పత్రాల ద్వారా అర్హతను నిరూపించుకోవచ్చునన్నారు. బిఎల్‌ఓలు ప్రతిరోజు కనీసం 30 గణన పత్రాలను సేకరించి, వాటిని ఎన్నికల సంఘం నిర్ధేశించిన పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సివుంటుందన్నారు.

### చదువుకోవడానికి వస్తే

# దాడులా..?

**ఎస్వీయూ హాస్టళ్లలో కొరవడిన భద్రత ?**
**విద్యార్థిపై దాడి ఆరోపణల కలకలం**
**ఉన్నతాధికారుల జోక్యానికి డిమాండ్**

తిరుపతి విద్య జూన్ 18 ప్రభాతవార్త



ఎస్వీయూ హాస్టల్‌లో బీఈడ్ తొలి సంవత్సరం విద్యార్థిపై మరో విద్యార్థి దాడి చేశాడన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపాయి. ఘటనలో గాయపడిన బాధిత విద్యార్థి బాలకృష్ణ తనకు న్యాయం చేయాలని, హాస్టళ్లలో విద్యార్థుల భద్రతపై విశ్వవిద్యాలయ అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.బాధిత విద్యార్థి తెలిపిన వివరాల ప్రకారం.. అధికారుల అనుమతులతో హాస్టల్ తిరిగి ప్రారంభం కావడంతో గురువారం హాస్టల్‌కు చేరుకున్నాడు. తన లగేజీని స్టడీ టేబుల్‌పై ఉంచిన సమయంలో, తనతో కలిసి అదే గదిలో ఉంటున్న కిరణ్ కుమార్ అనే విద్యార్థి బెంచ్ విషయంలో ఉద్దేశపూర్వకంగా వివాదానికి దిగాడని ఆరోపించారు.ఈ క్రమంలో తనను ఇనుప మంచాల మధ్యకు తోసివేసి, తలపై పలుమార్లు దాడి చేసి, ముక్కు నుంచి రక్తస్రావం అయ్యేలా కొట్టాడని తెలిపారు. ఘటన అనంతరం సంబంధిత అధికారులకు సమాచారం అందించినప్పటికీ తక్షణ చర్యలు కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.తాను ఇదే విశ్వవిద్యాలయంలో పీజీ (తెలుగు) పూర్తి చేసి ప్రస్తుతం బీఈడ్ తొలి సంవత్సరం చదువుతున్నానని, చదువుకునేందుకు వచ్చిన విద్యార్థులు భయాందోళనల మధ్య జీవించాల్సిన పరిస్థితి ఏర్పడడం బాధాకరమని పేర్కొన్నారు. హాస్టళ్లలో విద్యార్థుల భద్రతపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు.ఈ ఘటనపై విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత విద్యార్థి డిమాండ్ చేశారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హాస్టళ్లలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని కోరారు.

# చేపల మార్కెట్‌లో కుళ్ళిన చేపలు, రొయ్యలు

**రెండు దుకాణాలు సీజ్**
**హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్**



*తిరుపతి కార్పొరేషన్, జూన్ 18 ప్రభాతవార్త :*

*నగరంలోని చేపల మార్కెట్లో కుళ్ళి దుర్వాసనతో కూడిన చేపలు, రొయ్యలు ఉన్న రెండు దుకాణాలను సీజ్ చేశామని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తెలిపారు. జిల్లా కలెక్టర్ సూచనలతో, కమిషనర్ ఆదేశాల మేరకు లీలా మహల్ వద్ద గల చేపల మార్కెట్ లో వెటర్నరీ ఆఫీసర్, పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీ లు నిర్వహించామని తెలిపారు. తిరుపతి నగరంలోని లీలామహల్ వద్ద గల చేపల మార్కెట్ లో 22 షాపులు ఉన్నాయి. ఇక్కడ కుళ్ళిన చేపలు విక్రాయిస్తున్నట్లు పిర్యాదులు వచ్చాయని తెలిపారు. చేపలు, రొయ్యలను ఫ్రీజర్లలో ఉంచి విక్రాయిస్తున్నారని తెలవడంతో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఇందులో షాప్ నంబర్ 9, షాప్ నెంబర్ 10 షాపులలో చెడిపోయినటువంటి నిల్వ ఉంచిన చేపలను, రొయ్యలను గుర్తించామని తెలిపారు. ఫ్రీజర్ కి మూతలు లేకుండా సరియైన పద్ధతిలో నిలువ చేయకపోవడం వలన అందులోని చేపలన్ని పురుగులు పట్టి దుర్వాసన్ వస్తోందని తెలిపారు. ఆ రెండు షాపులలో నిల్వ ఉన్నటువంటి చేపలను తీయించి వాటిపై క్రిమిసంహారకాలను చల్లించి, మున్సిపల్ వాహనంలో డంపింగ్ యార్డుకు తరలించామని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ చట్టంలోని సెక్షన్ 492 నుంచి 498 వరకు 521 సెక్షన్ 541 నుంచి 546 వరకు మరియు 622సెక్షన్ లను అనుసరించి తనిఖీలు నిర్వహించి అందులో ప్రజారోగ్యమునకు హాని కలిగించే విధంగా ఉన్నటువంటి చేపలను స్వాధీనం చేసుకొని సదరు 9,10 షాపులకు ట్రేడ్ లైసెన్సులు రద్దు చేసి సీజ్ చేశామని తెలిపారు. మిగిలిన 20 షాపులకు పరిస్థితులను వివరించి ప్రజా ఆరోగ్య దృష్ట్యా ఇప్పుడు వాళ్లు ఉంచుకున్న పరిస్థితులను పరిసరాలను మరింత మెరుగ్గా ఉంచి ప్రజల వినియోగమునకు నాణ్యమైన చేపలను ఎప్పటికప్పుడు తెచ్చుకొని విక్రయించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు నాణ్యమైన చేపల వ్యాపారం చేసుకోవాలని, అలా లేనిచో ట్రేడ్ లైసెన్స్ రద్దుచేసి పై తెలిపిన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనికీలకు సంఘ నాయకులు, దుకాణదారులు సహకరించారని తెలిపారు. ఈ తనిఖీల్లో వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ గుణశేఖర్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.*

### పనులను నాణ్యత ప్రమాణాలతో

# వేగవంతంగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్..**
**తుడా చైర్మన్ అధ్యక్షతన తుడా బోర్డు సమావేశం**

తిరుపతి కలెక్టరేట్, జూన్ 18 ప్రభాతవార్త :

తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు.గురువారం తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో తుడా బోర్డు సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, తుడా చైర్మన్ సి దివాకర్ రెడ్డి, తుడా వైస్ చైర్మన్ ఆర్ గోవిందరావు తో కలిసి పాల్గొని అజెండాలోని పలు అభివృద్ధి పనులపై చర్చించారు. జిల్లా కలెక్టర్ తుడా పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపా యాల కల్పన, వివిధ ప్రాజెక్టుల పురోగతిపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుడా పరిధిలో అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ బోర్డు సమావేశంలో తుడా పరిధిలోని గల సూరప్పకసం గ్రామం వద్ద పద్మావతి నగర్ లేఔట్ విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు, కన్వెన్షన్ హాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆమోదించారు. తుడా పరిధిలో గల తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి దేవాలయముకు వెళ్ళు మార్గం వరకు గల ప్రాంతాల అభివృద్ధి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పన ట్రాఫిక్ రద్దీ తగ్గింపు కొరకు మాస్టర్ నిర్మాణం కొరకు ఆమోదించడం జరిగింది. సెట్టిపల్లి టౌన్షిప్ కు మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మాణం కొరకు ఆమోదం పొందినారు. నాయుడుపేటలో ఇంటర్నల్ డ్రైన్స్ నిర్మించుటకు ఆమోదం తెలిపారు. తిరుపతి సరస్సులు మరియు చెరువుల నగరంగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తుడా పరిధిలో వాతావరణ మార్పులు తట్టుకోగల సమీకృత నీటి నిర్వహణ అనే పేరుతో ఒక సమగ్ర ప్రాజెక్టును రూపొందించడం జరిగింది ఆమోదం పొందారు. పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అలాగే తుడా పరిధిలో చేపట్టనున్న కొత్త అభివృద్ధి ప్రాజెక్టుల ప్రతిపాదనలను పరిశీలించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.




తుడా చైర్మన్ మాట్లాడుతూ... తుడా పరిధిలోని చేపట్టే సూరప్పకసం లేఔట్ లో వివిధ నిర్మాణ పనులు , పద్మావతి నగర్ లేఔట్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ వారు లేఔట్ నందు కన్వెన్షన్ హాలు తదితర సౌకర్యాల పనులు పూర్తి కావాలనీ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు , తుడా ఎస్ ఈ రవీంద్ర, సి పి ఓ దేవి కుమార్,అధికారులు, వివిధ శాఖల అధికారులు మరియు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# సత్యవేడుకు మరో కీలక ప్రభుత్వ సంస్థ దూరం..

**మూతబడిన సత్యవేడు సబ్‌జైలు**
**భద్రతా లోపాలే కారణమంటూ ఖైదీలను చిత్తూరుకు తరలింపు**




మూతబడిన సత్యవేదు సబ్‌జైలు

సత్యవేదు, జూన్ 18 ప్రభాతవార్త:

సత్యవేడు పట్టణానికి మరో కీలక ప్రభుత్వ సంస్థ దూరమైంది. దశాబ్దాల చరిత్ర కలిగిన సత్యవేడు సబ్‌జైలు మంగళవారం నుంచి అధికారికంగా మూతపడినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. జైలు భవనం శిథిలా వస్థకు చేరుకోవడం, పైకప్పు దెబ్బతినడం, ప్రహరీ గోడలు పటిష్టంగా లేకపోవడం వంటి భద్రతా లోపాలను గుర్తించిన జైలు శాఖ ఉన్నతాధికారులు జైలును మూసివేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. జైలులో ఉన్న ఏడుగురు రిమాండ్ ఖైదీలను కట్టుదిట్టమైన భద్రతల మధ్య చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు. ఇకపై సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం, పిచ్చాటూరు మండలాల్లో నమోదయ్యే కేసుల్లో రిమాండ్‌కు వెళ్లే నిందితులను చిత్తూరుకు తరలించాల్సి ఉంటుంది. పోలీసులకు అదనపు భారం సబ్‌జైలు మూసివేతతో పోలీసుశాఖపై అదనపు భారం పడనుంది. ఇప్పటికే సత్యవేడు కేంద్రంగా పని చేసిన పలు ప్రభుత్వ కార్యాలయాలు గత కొన్నేళ్లుగా ఒక్కొక్కటిగా ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయన్న ఆవేదన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. ఎక్సైజ్ శాఖ కార్యాలయం నాగలాపురంకు, వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం పుత్తూరుకు మారగా, ఒకప్పుడు ఇంజనీర్లతో కళకళలాడిన తెలుగు గంగ ప్రాజెక్టు డీఈ కార్యాలయం కూడా కుదించబడింది. ప్రస్తుతం కేవలం ఏఈతో పాటు ఇద్దరు సిబ్బందితోనే కొనసాగుతోంది. ఇప్పుడు సబ్‌జైలు కూడా మూతపడడంతో సత్యవేడు ప్రాధాన్యత మరింత తగ్గిపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలల భవిష్యత్‌పైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమే కారణమా...సత్యవేడు సబ్‌జైలు తొలగింపు గురించి గత రెండేళ్లుగా ప్రచారం జరిగినప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు జైలు బలోపేతం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు ఒక్కొక్కటిగా తరలిపోతుండగా వాటి స్థానంలో కొత్త సంస్థలను తీసుకురావడంలో నాయకత్వం విఫలమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజల అసంతృప్తి ప్రతిఫలించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సత్యవేడు అభివృద్ధి రివర్స్ గేర్‌లో పడిందా...? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఇప్పుడు పాలకులు, ప్రజాప్రతినిధులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

# సూర్యఘర్‌తో ఇళ్ళకు సౌర విద్యుత్

**- సోలార్ పథకాలపై విస్తృతంగా అవగాహన**
**- ఎమ్మెల్యేల దృష్టికి ఆర్డీఎస్ఎస్ అభివృద్ధి పనులు**
**- విద్యుత్ సంస్కరణలు అమలుపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష**
**- ఎంపీ దగ్గుమళ్ళ, ఎమ్మెల్యేలు గురజాల , డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు**



చిత్తూరు, జూన్ 18 ప్రభాతవార్త:

ప్రతి ఇంటికి సౌర విద్యుత్ అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా వుందని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అధ్యక్షతన విద్యుత్ సంస్కరణల అమలు కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు, జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఎస్ఇ అమరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గృహ, వ్యవసాయ అవసరాలకు వేర్వేరు విద్యుత్ లైన్లు ఏర్పాటుతో పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. రూ.468.33 కోట్ల వ్యయంతో చేపట్టిన 11కెవి ఆర్‌డిఎస్ఎస్ పనుల్లో ఇప్పటి వరకు రూ.241.52 కోట్లు ఖర్చు చేశామని, మిగిలిన పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. సోలార్ ప్లాంట్ల నిర్మాణాల్లో జాప్యం వుండరాదని, నిర్మాణాల ఒప్పందంలో పేర్కొన్న కాలపరిమితికి లోబడి నిర్మాణ పనులు పూర్తి చేయాలని, నిర్మాణ పనులపై నిర్లక్ష్యం వున్న ఏజెన్సీల కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతామని ఎంపీ హెచ్చరించారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ నియోజకవర్గాల్లో జరిగే ఆర్‌డిఎస్ఎస్ పనులు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకురావాలన్నారు. పూతలపట్టు నియోజకవర్గంలో అత్యధిక రైతులు వున్నారని, వారికి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ సూర్యఘర్ పథకంపై పట్టణ ప్రాంతాల్లో సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం వుందన్నారు. అలాగే రైతులకు ఉపయోగపడేలా పిఎం కుసుమ్ పథకంను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద 18,456 ఆర్‌టిఎస్ ప్లాంట్స్ ఆమోదించామని, ఇందులో 1,408 ఆర్టీఎస్ ప్లాంట్స్ పూర్తి చేయడం జరిగిందన్నారు. సాధారణ వర్గాలకు 1 కెవి నుండి 3 కెవిల వరకు సోలార్ యూనిట్లపై సబ్సిడీ అందిస్తున్నామని, జిల్లాలో ఇప్పటి వరకు 4,500 కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు యుఎస్‌ఎ మోడల్ కింద నెలకు 200 యూనిట్లులోపు వినియోగం వున్న వారికి ఉచితంగా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే పిఎం కుసుమ్ పథకం ద్వారా రైతులకు పగటిపూట నిరంతర విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఇఇలు, డిఇలు మునిచంద్ర, సురేష్‌కుమార్, రామాంజనేయులు, అధికారులు అబ్దుల్ గయా, క్రాంప్టన్, రాఘవ కన్స్ట్రక్షన్ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకు భూసమస్యలు పరిష్కరించాలి



కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త

– కడ పి.డి. వికాస్ మర్మత్
– అభివృద్ధి పనులు పరిశీలన.. వేగంగా పూర్తికి ఆదేశం !!

అధికారులు నిబంధనల మేరకు గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. గురువారం గుడుపల్లె మండల ం గోకార్లపల్లి, శాంతిపురం మండలం చిన్నారిదొడ్డి గ్రామాల్లో పి.డి. పర్యటించి భూసమస్య అంశాలు పరిశీలించారు. రైతులు, గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కుప్పం ఏరియా ఆస్పత్రిలో నిర్మాణంలో ఉన్న సిటి స్కాన్ సె ంటర్ భవనం పనులు పరిశీలించారు. ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో జరుగుతున్న ఈ భవన నిర్మాణ పనులు నాణ్యతతో ఉండడంతో పాటు త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో చేపట్టిన సుందరీకరణ పనులు పరిశీలించారు. పచ్చదనం పెంపు, పరిశుభ్రత, రోగులకు అనుకూల వాతావరణం కల్పించాలన్నారు. అనంతరం కుప్పం మండల ం కెడిపల్లి గ్రామంలో ఏర్పాటుకానున్న శ్రేష్ట రెన్యువబుల్ ఎనర్జీ బయోగ్యాస్ ప్లాంట్ పరిశ్రమ స్థలాన్ని పరిశీలించారు. కుప్పంలో ప్రాంతంలో ఇంధన ఉత్పత్తి, పర్యావరణ పరిరక్షణతో పాటు ఉపాధి అవకాశాల కల్పనకు దోహదపడే ఈ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని అధికారులు, సంస్థ ప్రతినిధులకు సూచించారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం ప్రాంతంలో ప్రజలకు మౌలిక వసతుల కల్పన, ఉపాధి అవకాశాలు కల్పించే ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టినట్లు పి.డి. తెలిపారు. కార్యక్రమంలో కడ ఎపిడి శ్రీనివాసులు రాజు,ఆర్డీఒ షేక్ మహ్మద్ హుసేన్, కమీషనర్ శ్రీనివాసరావు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు,కడ సభ్యుడు రాజ్‌కుమార్, అధికారులు, నేతలు పాల్గొన్నారు.

## డ్రోన్‌సాయంతో పేకాట రాయుళ్లు అరెస్ట్

శాంతిపురం, జూన్ 18 ప్రభాతవార్త



మండలంలోని కెనమాకులపల్లి పంచాయతీ సిద్ధాపూరు సమీపంలోని ఓ కర్బూరం తోటలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను డ్రోన్ సాంకేతికతతో అరెస్ట్ చేసినట్లు రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ తెలిపారు. డ్రోన్ సహకారంతో పేకాట స్థావరంను గుర్తించి అక్కడ జూదం ఆడుతున్న శాంతిపురం మండలంకు చెందిన శ్రీనివాసులు, గజేంద్ర, గణేష్, కోటేశ్వరుడులను అరెస్ట్ చేశామన్నారు. నిందితులనుంచి 6500రూ.ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

## ట్యాంకర్లతో నీటి సరఫరాకు చర్యలు

శాంతిపురం, జూన్ 18 ప్రభాతవార్త



మండలంలోని గుండిశెట్టిపల్లి గ్రామంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని ఎంపిడిఓ ఎపిఆర్ కుమార్ పేర్కొన్నారు. గురువారం నీటి సమస్యపై గ్రామస్తుల ఫిర్యాదుతో గ్రామంలో పర్యటించారు. వడ్డివానికుంట చెరువులో ఉన్న ప్రభుత్వ బోరు పరిశీలించారు. ప్రస్తుతం బోరు రిపేరు చేయని స్థితిలో ఉందన్నారు. కొత్త బోరు మోటారు, స్టార్టరు, పైపుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెస్కో డైరెక్టర్ అనసూయ, మాజీ సర్పంచ్ మంజునాథ్, బాలు, మునెప్ప, శివానంద, ఉమాపతి పాల్గొన్నారు

## వందేభారత్‌కు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వాలి

కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త



కుప్పం ప్రజల సౌకర్యార్థం కుప్పంలో వందేభారత్ రైలుకు స్టాపింగ్ కేటాయించాలని కోరుతూ కుప్పం బిజెపి ఇన్‌చార్జ్ తులసినాథ్ దక్షిణ పశ్చిమ రైల్వే జిఎంకు వినతిపత్రం అందజేశారు. బెంగళూరు – విజయవాడ మధ్య తిరిగే వందేభారత్ రైలుకు స్టాపింగ్ ఇవ్వాలని తద్వారా ప్రజలు, విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. అలాగే పుష్‌పుల్, మెమూ రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంచాలన్నారు. క్రమమైన సమయాలను కేటాయించాలని కోరారు.

## రైతుల సంక్షేమం సిఎం చంద్రబాబు లక్ష్యం

– కడ సభ్యుడు రాజ్‌కుమార్

కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త



రైతుల సంక్షేమం సిఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం అని కడ సభ్యుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు.గురువారం మున్సిపల్ పరిధి సామగుట్టపల్లి, బండ శెట్టిపల్లి, తంజమ్మ కొటాలు, శీగలపల్లి, పెద్దన్నకొటాలు,నారాయణపురం గ్రామాల రైతులకు రాయితీతో కూడిన వేరుసెనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం సిఎం చంద్రబాబు కృష్ణాజలాలు తీసుకొచ్చి చెరువులు నింపుతున్నారన్నారు. అలాగే వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా రాయితీలు అందిస్తున్నారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, యూనిట్ ఇన్‌చార్జ్ ముత్తు, సీనియర్ నేత గోవిందస్వామి, తెలుగుయువత నేతలు, రైతులు పాల్గొన్నారు.

## వసంతాపురం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు

జాతీయ స్థాయి కాయకల్ప అవార్డు

గుడిపాల, జూన్ 18 ప్రభాతవార్త:

గుడిపాల మండలం వసంతాపురం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనం జాతీయ స్థాయిలో ప్రతిషా



ాత్మకమైన కాయకల్ప అవార్డును అందుకుంది. గుడిపాల పిహెచ్‌సి డాక్టర్ సంధ్య గురువారం వసంతాపురం సచివాలయం ఆవరణలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్ డాక్టర్ దివ్యదీప్తి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య, డాక్టర్ చంద్రమహేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రత ఇన్ఫెక్షన్ నివారణ చర్యలు, పర్యావరణ పరిరక్షణ, రోగులకు స్థిరంగా అందిస్తున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది అంకిత భావంతో విధులు తదితరాలతో ఈ అవార్డు దక్కిందన్నారు. ఈ సందర్భంగా వసంతాపురం హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఉమా మహేశ్వరి, జబసెల్వి, హేమలత, ఆశా కార్యకర్తలు సుజమ, స్వప్నలకు అవార్డు, ప్రసంశాపత్రంను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ బాలసూర్యానారాయణ, మాజీ సర్పంచ్ రజనీకాంత్, సిబ్బంది త్రిలోక్, చంద్రమ్మ, మేరీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా నాయకుడు మృతి.. నేతల సంతాపం

కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త



మండలంలోని చెక్కునత్తంకు చెందిన తెదేపా నేత పోస్ట్‌మ్యాన్ తిమ్మప్ప తండ్రి అజ్జప్ప మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్న ం చెక్కునత్తం గ్రామంకు చేరుకుని అజ్జప్ప మృతదేహంకు ఘన నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతికలగాలని ప్రార్థి ంచారు.టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కార్పోరేషన్ డైరెక్టర్ మణి, తెలుగు యువత అధ్యక్షుడు కనకరాజు, మాజీ ఎంపిపి డాక్టర్ వెంకటేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కదిరప్ప పాల్గొన్నారు.

## వరసిద్ధుని సేవలో ఆర్‌కె రోజా



కాణిపాకం, జూన్ 18 ప్రభాతవార్త: మాజీ మంత్రి ఆర్‌కె రోజా గురువారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆమెకు ఆలయ సూపరిటెండెంట్‌లు వాసు, కోదండపాణిలు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆమె స్వామి వారి సేవలో పాల్గొన్నారు. అలాగే ఆమె శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం, నవగ్రహాలయంలో కూడా ఆర్‌కె రోజా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు వేదమండపంలో అశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## కుప్పంలో హాకీ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు చర్యలు

– శాప్ డైరెక్టర్ రజని

కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పంలో హాకీ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు పరిశీలిస్తున్నట్లు శాప్ డైరెక్టర్, అ ంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి, ఆసియా క్రీడల్లో రజతపతకం సాధించిన రజని పేర్కొన్నారు. గురువారం ఆమె కుప్పంలో పర్యటించారు. పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. హాకీ శిక్షణ కేంద్రం స్థాపనకు అవసరమైన మౌలిక వసతులు, మైదానాలు, విద్యార్థుల ఆసక్తిని పరిశీలించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో హాకీ ప్రతిభను వెలికితీసి వారికి ఉన్నతస్థాయి శిక్షణ అందించమే ఈ కేంద్రం లక్ష్యమన్నారు. అనంతరం ఆమె కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నంలను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కమీషనర్ శ్రీనివాసరావు, ఎంఇఒ రాజారాం, డిఎస్‌డిఒ భాస్కర్, సీనియర్ కోచ్ ప్రసన్నకుమార్‌రెడ్డి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మహేష్, పిఇటిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతిలేఔట్ ప్రాంతంలో విద్యుత్ వసతుల కల్పన

కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ 11వ క్లస్టర్ పరిధి చిన్నకురబలపల్లి గ్రామంలోని శాంతిలేఔట్ ప్రాంతంలో ప్రజలకు విద్యుత్ వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. ప్రజల సౌకర్యార్థం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్థంభాలు ఏర్పాటుచేస్తున్నట్లు క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, రెస్కో డైరెక్టర్ శివతేవర్ తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు భాస్కర్, సాయికుమార్, బూత్ ఇన్‌చార్జ్ ఉమాశంకర్, రెస్కో సిబ్బంది పాల్గొన్నారు.

## ఎపిఎస్‌సిపిసిఆర్ సభ్యురాలిచే వన్‌స్టాప్‌సెంటర్ పరిశీలన

కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త



రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యురాలు పద్మలత గురువారం కుప్పం ఏరియా ఆస్పత్రిలోని మిషన్ శక్తి సీ ్రమ్ సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఐసిడిఎస్ పి.డి. వెంకటేశ్వరితో వన్‌స్టాప్ సెంటర్‌లో అందుతున్న సౌక ర్యాలు, ఇక్కడి కార్యక్రమాలపై అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో డిసిపిఒ డాక్టర్ సుబ్రమణ్యం, డిఎంసి నిర్మల పాల్గొన్నారు.

## బాలలహక్కుల కమీషన్ మెంబర్‌ను కలసిన ఆర్టీసీవైస్‌ఛైర్మన్

కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త



కుప్పం పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యురాలు వెంకట పద్మలతను ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కుప్పం ప్రాంతంలో విద్య, బాలల సంక్షేమం, ఇతర అభివృద్ధి అంశాలపై చర్చించా రు. బాలల హక్కుల పరిరక్షణతో పాటు వారి అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అభిప్రాయాలు పంచుకున్నారు.

# ఉచిత కృత్రిమ చేతుల పంపిణీ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

చిత్తూరు, జూన్ 18 ప్రభాతవార్త:



ఎపి రాష్ట్ర శాఖ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీ జిల్లా 3150–ఎల్ఎన్4 హ్యాండ్ ప్రాజెక్ట్ సంయుక్త సహకారంతో భుజం కింద భాగంలో చేయి కొల్పోయిన వికలాంగులకు ఉచిత కృత్రిక చేతులు పంపిణీ కార్యక్రమం పోస్టర్లను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ ఛాంబర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.తేజోమూర్తితో కలిసి గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఈ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడుతూ జిల్లాలో కృత్రిమ చేతులు అవసరమైన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.తేజోమూర్తి మాట్లాడుతూ 4 సంవత్సరాల పైబడి వయస్సు కలిగి భుజం కిందిభాగంలో చేయి కొల్పోయిన వారు కృత్రిమ చేతులు పొందడానికి అర్హులని, అలాంటి వారు 88663 06969 నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న వారు సెప్టెంబర్ 6వ తేదీన అనంతపురం జిల్లాకు వెళ్ళాల్సివుంటుందన్నారు. అలాగే రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ గోవర్ధన్‌బాబి మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన వారు ఈ కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని, ప్రాజెక్ట్ హ్యాండ్ కార్యక్రమంపై మరింత సమాచారం కావాలనుకుంటే రెడ్‌క్రాస్ కార్యాలయం 83748 10066 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి ఆర్.రాజగోపాల్‌నాయుడు, పరిపాలన అధికారి గోపి, జిల్లా క్షేత్ర అధికారి వి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## పలమనేరు ఎమ్మెల్యేను కలసిన సర్వే సంఘం రాష్ట్ర అధ్యక్షులు

పలమనేరు రూరల్, జూన్ 18 ప్రభాతవార్త

రాష్ట్ర సర్వే సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.వెంకటరమణ రెడ్డి, కార్యవర్గ సభ్యులతో కలిసి గురువారం పలమనేరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో స్థానిక శాసనసభ్యుడు అమరనాథ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా సర్వే శాఖలోని ఉద్యోగుల సమస్యలపై, ముఖ్యంగా గ్రామ సర్వేయర్ల పదోన్నతులు, జీతాల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఎమ్మెల్యేతో సుదీర్ఘంగా చర్చించారు. సర్వే ఉద్యోగుల సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే స్పందిస్తూ... ఈ సమస్యలను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు పూర్తి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడం పట్ల సర్వే సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సర్వే సంఘం పలమనేరు డివిజన్ అధ్యక్షులు నరేష్ తో పాటు నాయకులు మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పిల్లలకు విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యతలు నేర్పండి

– ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

చిత్తూరురూరల్, జూన్ 18 ప్రభాతవార్త:



పిల్లలకు చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యతను తెలియజేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. గురువారం చిత్తూరు ప్రశాంత్‌నగర్‌లో హర్ష్ ఇంగ్లీషు మీడియం అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో పాటు సరదాగా ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాలను చూసి బాగా చదువుకొని మంచి పేరు తీసుకురావాలని కోరారు. అలాగే విద్యార్థులకు బ్యాగు, వాటర్‌బాటిళ్లలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రాజేష్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, నరేష్, పచ్చయప్ప, పాఠశాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, కూటమినాయకులు పాల్గొన్నారు.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ ఫలితాల్లో ఆర్‌కె విద్యార్థుల ప్రతిభ

చిత్తూరురూరల్, జూన్ 18 ప్రభాతవార్త:



చిత్తూరునగరం, రుక్మిణి క్రిష్ణస్వామి విద్యాలయ జూనియర్ కళాశాల విద్యార్థులు నేడు ప్రకటించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర, నగర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరచారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం రమేష్‌బాబు తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపిసీ విభాగంలో ఆర్ చందన 465 మార్కులతో రాష్ట్రస్థాయిలో నాల్గవర్యాంకు, మహేష్ 463, మోహిత్ 463, రాజా 461, దీపిక 460మార్కులు, ఎంఈసి నందు ఎన్ఎస్ చిరష్వి 495మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండవర్యాంకు, టి ప్రగ్నరెడ్డి 494, ఎన్ ఉషశ్రీ 493, టిఎస్ పూర్ణిషా 493మార్కులు సాధించారు. బైపిసిలో నిఖిత 440, సభియయఫాజా 440, మంజు 419మార్కులు, సిఈసినందు సుహాన 457, కావ్య 444మార్కులు సాధించారన్నారు. అలాగే ద్వితీయసంవత్సరం ఫలితాల్లో సీనియర్ ఎంపిసీ గ్రూపు నందు పూజశ్రీ 987మార్కులతో రాష్ట్రస్థాయిలో ఆరవర్యాంకు, శ్యామ్‌చరణ్ 983, షాలిని 962మార్కులు, ఎంఈసిలో గౌతమి 983మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండవర్యాంకు, నాగగాయత్రి 981మార్కులతో నాల్గవ ర్యాంకు, నితిన్ 973మార్కులు సాధించారన్నారు. బైపిపి నందు పూజ 986మార్కులతో ఐదవర్యాంకు, జస్విత 974, తనుశ్రీ 971మార్కులు, సిఈసిలో పవిత్ర 941, హలిమా ముబారక్ 935, సునీల్ 934మార్కులు సాధించారని తెలిపారు. కాగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను శ్రీనివాసా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డా.కల్పజ ప్రత్యేకంగా అభినందిస్తూ తమ తల్లిదండ్రులు కీ.శే డా ఆదికేశవులు, సత్యప్రభలు ఉన్నత ఆశయాలతో అనేక విద్యాసంస్థలను నెలకొల్పారని పేర్కొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో విద్యానికేతన్ విజయకేతనం

వి.కోట, జూన్ 18 ప్రభాతవార్త



గురువారం విడుదలైన ఇంటర్ సప్లిమెంటరీ,ఇంప్రూవ్మెంట్ ఫలితాల్లో విద్యానికేతన్ కళాశాల విద్యార్థిని లోధీ నేహా అలీ ఖాన్ స్టేట్ ర్యాంక్ సాధించింది. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 990/1000 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది.గతేడాది జూనియర్ ఇంటర్‌లో 465/470 మార్కులతో స్టేట్ 4వ ర్యాంక్ సాధించింది.7 ఏళ్ల క్రితం మండలంలో ప్రారంభమైన విద్యానికేతన్ కళాశాల ప్రతి ఏటా మెరుగైన ఫలితాలతో గుర్తింపు పొందుతోంది.ర్యాంకర్ నేహా అలీ ఖాన్‌ను కరస్పాండెంట్లు ఎస్ఆర్ దామోదర్ రెడ్డి,పీవీ రమేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ యుగంధర్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

## కూటమి ప్రభుత్వంతోనే పాఠశాలలు అభివృద్ధి

రామకుప్పం, జూన్ 18 ప్రభాతవార్త



పాఠశాలలు అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, ఎంపిపి సులోచన గుర్రప్ప పేర్కొన్నారు.గురువారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు విద్యా కిట్లను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం, మౌలిక సదుపాయాలు, నారా లోకేష్ తినలేని కృషి చేశారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడల్లోనే చేర్పించి మంచి విద్యాభ్యాసం అందించాలన్నారు. జూలై మాసంలో ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదు జమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నారాయణ, వైసీపీ వెంకట్రామ గౌడు, నేతలు సీతాపతి ,విశ్వనాథ్, రవి రెడ్డి, బాలరాజు, ఆదిల్, ఆంజనేయప్ప, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సోయాబీన్ సాగుకు ప్రోత్సాహం

– ఉచిత విత్తనాలు, ఎరువులు, కొనుగోలు హామీ

పూతలపట్టు, జూన్ 18, ప్రభాతవార్త



రైతుల ఆదాయాన్ని పెంచడం మరియు పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ, ఎస్‌వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా పూతలపట్టు మండలంలో సోయాబీన్ సాగు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే రైతులకు ప్రభుత్వం, సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా సోయాబీన్ విత్తనాలు మరియు అవసరమైన ఎరువులు అందజేయడం జరుగుతుందన్నారు. పంట సాగు కాలంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సాంకేతిక సలహాలు, పంట యాజమాన్య సూచనలు అందిస్తారు. అంతే కాకుండా, రైతులు పండించిన సోయాబీన్ దిగుబడిని ఎస్‌వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కిలోకు రూ.45 చొప్పున కొనుగోలు చేయడానికిముందుకు వచ్చింది. దీంతో రైతులకు మార్కెట్ ధరల హెచ్చుతగ్గులపై ఆందోళన లేకుండా గిట్టుబాటు ధర లభించనుంది.పంట కోత పనులను కూడా సంస్థ యాంత్రీకరణ ద్వారా నిర్వహించనుండటంతో రైతులకు కార్మికుల కొరత సమస్య తలెత్తకుండా ఉంటుంది. ఈ కార్యక్రమం ద్వారా సోయాబీన్ సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. సోయాబీన్ సాగుపై ఆసక్తి గల రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రం లేదా వ్యవసాయ అధికారులను సంప్రదించి నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పిలుపునిచ్చారు.

## అంత్యక్రియలకై దేశం నేతచే ఆర్థికసాయం

కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త



స్థానిక కొత్తపేట ఇందిరా కాలనీ 15వ వార్డులో నివాసం ఉన్న శివప్ప మృతి చెందాడు. శివప్పది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కొత్తపేట యూనిట్ ఇన్‌చార్జ్ అప్పు(ముఖేష్) తన వంతు సహకారంగా పదివేల రూపాయల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి సిఎం చంద్రబాబునాయుడు తరపున అందజేశారు. ఈ సందర్భంగా అప్పు మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకునేందుకు తెదేపా, సిఎం చంద్రబాబునాయుడు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో 15వ వార్డు పార్టీ అధ్యక్షుడు సుకుమార్, బూత్ ఇన్‌చార్జ్ రాహుల్‌కుమార్ పాల్గొన్నారు.

# స్థానిక సమరానికి సిద్ధం కండి : ఎమ్మెల్యే నెలవల




సూళ్లూరుపేట, జూన్ 18 ప్రభాతవార్త: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి నేతలు, కార్యకర్తలు సమన్వయం పనిచేసి కూటమి ప్రభుత్వ సత్తా చాటాలని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ అన్నారు. గురువారం కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరిం చుకుని నియోజకవర్గ కూటమి నేతల ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. శ్రీ కనకదుర్గ కళ్యాణ మండపంలో నిర్వహించిన విజయోత్సవ సభలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రసంగిస్తూ అభివృద్ధి, సంక్షేమం నినాదంతో స్థానిక ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల మనసులను గెలవాలని ఆమె సూచించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలను అపహాస్యం చేశారన్నారు. అరాచకంతో నామినేషన్ కూడా వేయనీయకుండా చేసి ఏకగ్రీవలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. ఇందుకు ప్రజలు వైసిపి పార్టీకి మంచి గుణపాఠం నేర్పి 2024 శాసనసభ ఎన్నికల్లో 11 స్థానాలకే పరిమితం చేయడం జరిగిందాని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడం జరుగుతున్నారు. ఇందులో భాగంగా ప్రతి పంచాయతీలను, మున్సిపాలిటీలలోను తప్పకుండా ఎన్నికలు జరుగుతా యన్నారు. సూళ్లూరుపేట వాసుల చిరకాల స్వప్నమైన కాళంగి నదిపై నూతన వంతెన నిర్మాణం త్వరలోనే చేపట్టడం జరుగుతుందని ఆమె వెల్లడించారు. తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు, టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి పరుగులు పరుగులు పెడుతుందని అన్నారు. అంతకు ముందు పట్టణంలో కూటమి నేతల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి శ్రీ కనకదుర్గ మహల్ కళ్యాణ్ వరకు భారీ ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసి చైర్మన్లుఆకుతోట రమేష్, ఉయ్యాల ప్రవీణ్, పార్టీ సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఎఫ్ ఎస్ సి ఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, బిజెపి నాయకులు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, 786 రఫీ, కామిరెడ్డి మురళి రెడ్డి, ముప్పాళ్ళ శ్రీహరి రెడ్డి, పాకం వెంకటసుబ్బయ్య, బొమ్మన పళని, తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విజయోత్సవ ర్యాలీకి టిడిపి నేతలు



నాయుడుపేట, జూన్ 18 ప్రభావతవార్త: సూళ్లూరుపేట పట్టణంలో గురువారం జరిగిన ఎన్డీఏ కూటమి రెండేళ్ల విజయోత్సవ ర్యాలీలో పాల్గొనేందుకు నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ రఫీ ఆధ్వర్యంలో పలువురు టిడిపి నేతలు బయలుదేరి వెళ్లారు. సూళ్లూరుపేట పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి రెండేళ్ల పాలన విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొనేందుకు నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా సూళ్లూరుపేట విజయోత్సవ ర్యాలీకి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానాబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు అవధానం సుధీర్, నిత్య కృష్ణారెడ్డి, వినుకొండ ధనంజయ, ఇమ్మడిశెట్టి వెంకటేశ్వర్లు, వాకిటి వెంకటేశ్వర్లు, హైమావతి, చిట్టి దేవతి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు నాయుడుపేటలో ప్రజా దర్బార్

**- హాజరుకానున్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే, తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్**



నాయుడుపేట, జూన్ 18 ప్రభాతవార్త: సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలోని ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తిరుపతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ (ఆర్డీవో) కార్యాలయం నుండి ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు (సర్క్యులర్) జారీ అయ్యాయి. జూన్ 19, 2026 (శుక్రవారం) ఉదయం నుండి మధ్యాహ్నం వరకు నాయుడుపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్ నందు ఈ ప్రజా దర్బార్, ఒక నియోజకవర్గం, నాలుగు విజిట్స్ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ నున్నారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను, వివిధ సమస్యలను స్వీకరించి అక్కడికక్కడే పరిష్కారాలు చూపేందుకు ఈ వేదికను యంత్రాంగం సిద్ధం చేస్తోంది. ఈ ప్రతిష్టాత్మక ప్రజా దర్బార్ కార్యక్రమానికి గౌరవ సూళ్లూరుపేట శాసనసభ్యులు, తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌తో పాటు సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా, మండల స్థాయి ఉన్నతాధికారులు, సిబ్బంది ప్రత్యక్షంగా హాజరు కానున్నారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా భావించి విజయవంతం చేయాలని రెవెన్యూ యంత్రాంగం పిలుపునిచ్చింది.

## హోంమంత్రి అనితపై విమర్శలు చేస్తే ఊరుకోం

**- తెలుగుమహిళ నేతలు**



కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త : హోంమంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు చంద్రకళ, రెస్కో డైరెక్టర్ అనసూయ, కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగళ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దళిత మహిళను మాజీ మంత్రి అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేకప్ మంత్రి అంటూ వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అమర్‌నాథ్ ఇంట్లో ఆడవారు ఎవరూ మేకప్‌లు వేసుకోరా అని ప్రశ్నించారు. మహిళలు తిరగబడితే అమర్‌నాథ్ బయట తిరగలేరని హెచ్చరించారు. హోంమంత్రి అనిత సినీనటి, మాజీ మంత్రి రోజాలా వ్యవహరించరన్నారు. అర్ధరాత్రి సైతం ఏ సమస్య వచ్చినా హోంమంత్రి స్పందిస్తున్నారన్నారు. గొడ్డలి పార్టీలో మహిళల్ని గౌరవించే సంస్కారం నేర్పలేదా అని ప్రశ్నించారు. తమకు సిఎం చంద్రబాబు సంస్కారం, క్రమశిక్షణ నేర్పడంతోనే ఊరుకుంటున్నామన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు మరలా చేస్తే నోటికి గట్టిగా తాళాలేస్తామని పేర్కొన్నారు. మాజీ మంత్రి అమర్‌నాథ్ హోంమంత్రి అనితకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా నేతలు శారదమ్మ, శ్యామల, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గుజ్జు ఫ్యాక్టరీని తనిఖీ చేసిన జిల్లా అధికారులు



పుత్తూరు రూరల్, జూన్ 18 ప్రభాతవార్త: పుత్తూరు మండలం పరమేశ్వరి మంగళంలోని లియోన్‌ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ గుజ్జు ఫ్యాక్టరీకి జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్(హెడ్ ఆఫీస్ గుంటూరు) జిల్లా ఉద్యాన అధికారి దేవమునిరెడ్డి, తిరుపతి దశరథరామిరెడ్డిలు సందర్శించారు. లియోన్ గుజ్జు పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ లోకాద్రినాయుడుతో ప్రస్తుతం తోతాపూరి మామిడి సేకరణ, ధరల గురించి చర్చించారు. జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ వారు మామిడి రైతులకు తోతాపూరి మామిడి కిలో రూ.6 నుంచి 7వకు తగ్గించకుండా చెల్లించాలని యాజమాన్యాన్ని కోరారు. అదే విధంగా జిల్లాలోని మండీలు, రాంపుల వద్ద కూడా తక్కువ ధరకు కొనుగోలు చేయకుండా రైతుకి మంచి ధర కల్పించాలని అలా కాని పక్షంలో తక్కువ ధరకు కొనుగోలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫ్యాక్టరీలో రోజువారి మామిడి పరిమాణం(డైలీ రిక్యూర్‌మెంట్)బట్టి రైతులు కాయలను హార్వెస్ట్ చేయాలని అదే విధంగా జిల్లాలోని అందరూ ఉద్యాన అధికారులు, ఉద్యాన సిబ్బంది రైతులకు తమ గ్రామాల్లోని మామిడి రైతులకి కాయ నాణ్యతను తగ్గించకుండా నాణ్యత నిర్వహించి దాఫాలుగా కాయలు కోత కోసి ఫ్యాక్టరీలకు తరలించవలసిందిగా రైతులు అవగాహన కల్పించాలని తెలియజేశారు. రైతలందరూ కూడా ఒక సారిగా తోతాపురి కాయలు కోయడం వలన ఫ్యాక్టరీలో ఎదుట ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తుంది. తద్వారా కాయలు డామేజ్ అయ్యే అవకాశం ఉంది కాబట్టి ఫ్యాక్టరీల యొక్క రోజువారి పరిమిత బట్టి టోకెన్ల ప్రకారం హార్వెస్ట్ చేయాలని పేర్కొన్నారు.

## పాడి రైతుల సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన

**- కలెక్టర్ సుమిత్‌కుమార్**

చిత్తూరుహెల్త్, జూన్ 18 ప్రభాతవార్త: పాడి రైతుల సంక్షేమ పథకాల అమలుపై క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పాడి రైతుల అభ్యున్నతికి పశుసంవర్ధకశాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై పశుసంవర్ధకశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోపి పాడి రైతులకు రానున్న 6 నెలల కాల వ్యవధిలో ఎల్‌నినో ద్వారా ఏర్పడే ప్రతికూల పరిస్థితుల ప్రభావంను ఎదుర్కొవడానికి తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్ర స్థాయిలో పాడి రైతులతో చర్చించి వారి అభిప్రాయాలు సేకరించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పశు సంక్షేమం, రైతు శ్రేయస్సు లక్ష్యంగా పశు సంవతి పెంపు కోసం, పాడి రైతుల ఆర్థిక ఆదాయం గణనీయంగా పెంచడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పశుకేంద్రీత విధానంపై క్షేత్రస్థాయి సిబ్బంది, పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ క్షేత్ర స్థాయిలో పశుకేంద్రిత విధానం అమలు చేయడం కోసం రూపొందించిన పుస్తకంను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పశు సంవర్ధకశాఖ జెడి ఉమా మహేశ్వరి, ఇతర పశుసంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ ముఠా గుట్టురట్టు

**- నలుగురు నిందితుల అరెస్ట్**

**- రూ.17 లక్షల విలువైన 128 గ్రాముల స్వర్ణాభరణాలు స్వాధీనం**



నాయుడుపేట, జూన్ 18 ప్రభాతవార్త: నాయుడుపేట, ఓజిలి పరిసర ప్రాంతాల్లో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని వరుసగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఒక ప్రమాదకరమైన నలుగురు సభ్యుల దొంగల ముఠాను పోలీసులు ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నారు. తిరుపతి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అధికారులు ఈ ముఠా అరెస్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా వెల్లడించారు. పోలీసుల నిఘా, ముమ్మర తనిఖీల్లో భాగంగా పట్టుబడిన ఈ నిందితుల నుంచి సుమారు రూ.17 లక్షల మార్కెట్ విలువ కలిగిన 128 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. వీటితో పాటు వారు దొంగతనాలకు, నేరాలకు ఉపయోగించిన 2 మోటార్ సైకిళ్లను (బైకులు) కూడా స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులను ఈ క్రింది విధంగా గుర్తించారు నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామానికి చెందిన పిగిలాం నవీన్ (23) ఆదే ప్రాంతానికి చెందిన పిగిలాం గణేష్ (32) బల్లి వెంకటేశ్వర్లు (34) కొడివాడపాలెం గ్రామానికి చెందిన లిఖిత్ (19) ఈ నలుగురు నిందితులను క్షుణ్ణంగా విచారించగా, వీరు ఈ ప్రాంతాల్లో ఇప్పటివరకు మొత్తం 8 చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడినట్లు నేరాన్ని అంగీకరించారు. నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ముఠాను చాకచక్యంగా పట్టుకున్న పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.

## నూతన గదులు నిర్మాణం



తడ, జూన్ 18 ప్రభాతవార్త: పానాసోనిక్ సంస్థ సహకారంతో తడ మండలం రామాపురం మోడల్ ప్రైమరీ స్కూల్ నందు నాలుగు అదనపు గదులు దాదాపు 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించారు నూతనంగా నిర్మించిన పాఠశాల గదులను గురువారం పానాసోనిక్ కంపెనీ ఎండి సెంథిల్ కుమార్, ప్రారంభించారు. సిఎస్ఆర్ యాక్టివిటీ క్రింద పానాసోనిక్ సంస్థ అనేక అభివృద్ధి చేస్తున్నందుకు విద్యాశాఖ అధికారులు వేములు, మల్లికార్జునరావు, రామాపురం మాజీ సర్పంచ్ టికే శ్రీనివాసన్ ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పానాసోనిక్ సంస్థ ఎండీ సెంథిల్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రజారోగ్యానికి భంగం కల్పిస్తే... కఠిన చర్యలు తీసుకుంటాం

**కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి**



తిరుపతి కార్పొరేషన్, జూన్ 18 ప్రభాతవార్త: తిరుపతి నగరంలో ప్రజారోగ్యానికి భంగం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. తిరుపతి నగరంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల దృష్ట్యా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు సేవలు అందించుటకు గాను ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలు మరియు ఇతర ఆహార వ్యాపార సంస్థల యజమానులు నిర్వాహకులకు జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి సూచనల మేరకు పలు నిబంధనలను, జాగ్రత్తలను తెలిపారు. తిరుపతి నగర పరిధిలోని అన్ని హోటల్లు రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో, రెసిడెన్షియల్ స్కూలు, హాస్టల్స్, నర్సింగ్ హాస్టల్స్, ఆహార పదార్థాలు విక్రయించు వీధి వ్యాపారులు, బార్ అండ్ రెస్టారెంట్లు, సినిమా థియేటర్లు, మెస్సులు, ఐస్ క్రీమ్ పార్లర్లు, మాంసం, చేపలు విక్రయ కేంద్రాలు మరియు ఇతర ఆహార పదార్థాల వ్యాపార సంస్థల యజమానులు తాము సూచించిన నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా ఆహార భద్రత, పరిశుభ్రత మరియు పారిశుద్ధ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఆహార పదార్థాల నిలువ తయారీ అమ్మకము భుజించు ప్రదేశం మరియు విక్రయంలలో పరిశుభ్రత పాటించాలి పచ్చి ఆహార పదార్థాలను వండిన ఆహార పదార్థాలతో కలిపి నిలువ చేయరాదు మరియు వండిన ఆహార పదార్థాలను సరియైన పద్ధతిలో నిలువ ఉంచాలి. ఎక్కువ కాలం నిలువ ఉంచారాదు. కలుషితమైన, పాడైన గడువు ముగిసిన లేదా మానవ వినియోగానికి అనర్హమైన ఆహార పదార్థాలను నిల్వ చేయడం, విక్రయించడం లేదా వినియోగించడం మరియు సింగల్ యూస్ ప్లాస్టిక్ లో ప్యాకింగ్ చేయడం, సింగల్ యుస్ ప్లాస్టిక్ వినియోగించడం, సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం పూర్తిగా నిషేధించడం అయినది మరియు మానవ విని యోగం ప్యాకింగ్ చేయబడిన వాటిపై లేబుల్స్, తయారీ తేదీ, గడువు తేదీ తప్పనిసరిగా ముద్రించవలెను. మున్సిపల్ కార్పొరేషన్ చట్టం అనుసరించి మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారులు నగరంలోని ఆహార వ్యాపార సంస్థలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించనున్నారు. తనిఖీలలో అపరిశుభ్రమైన వంటశాలలు, స్టోర్ రూములు, వినియోగించే హాలు అపరిశుభ్రంగా ఉండడం, పాడైన మాంసం, పాడైనఆహార పదార్థాలు చెత్తచేదారం పేరుకుపోయి ఉండడం, వ్యర్థాలను తడి, పొడి మరియు ప్రమాదకర వ్యర్థాలుగా వేరు చేయక విచ్చలవిడిగా పారవేయడం బొద్దింకలు, ఎలుకలు, పురుగులు ఉండటం, గాలి, వెలుతురు సరిగా లేకపోవడం, మురికినీటి సమస్యలు, ఆహార భద్రతా నిబంధన ఉల్లంఘనల పై చర్యలు గుర్తించిన పక్షంలో సంబం ధిత సంస్థలపై, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొనబడునని, నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలనుండి మున్సిపల్ కార్పొరేషన్ చట్టాల ప్రకారం, ఆహార పదార్థాల స్వాధీనం, నోటీసులు జారీ, ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడం, తాత్కాలికంగా మూసివేయడం వంటి చట్టపరమైన చర్యలు తీసుకొని, క్రిమినల్ కేసులు నమోదు చేయబడునని హెచ్చరించడం అయినది మానవ వినియోగానికి త్రాగుటకు, వంట తయారీకి పరిశుభ్రమైన నీటిని వినియోగించాలి, వ్యాపార సంస్థలలో మరుగుదొడ్ల సౌకర్యం, ప్రథమ చికిత్స కిట్స్ ఏర్పాటు చేయాలి, ప్రజలకు ఆహార పదార్థాలు సరఫరా చేయునప్పుడు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి అన్ని వ్యాపార సంస్థలు ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ మరియు మున్సిపల్ నిబంధనలను కచ్చితంగా పాటించి పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించాలని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన సీఎం పిఎ శ్రీకాంత్



కుప్పం, జూన్ 18 ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను సీఎం చంద్రబాబు నాయుడు నూతన పి ఎగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ గురువారం చిత్తూరు కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుప్పంలో జరుగుతున్న, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కలెక్టర్ తో సీఎం పిఏ శ్రీకాంత్ చర్చించారు. బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ గురువారం చిత్తూరు కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుప్పంలో జరుగుతున్న, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో సీఎం పిఏ శ్రీకాంత్ చర్చించారు.

## పట్టురైతుల సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి



పలమనేరు, జూన్ 18 ప్రభాతవార్త: పలమనేరు పట్టుగూళ్ళ మార్కెట్‌లో రైతులు తమ సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. తమకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కర్నాటకలో వలె కెజికి రూ.50 వంతున ఇన్‌సెంటివ్ అందజేయాలని కోరారు. రైతుల సమస్యలు సావధానంగా విన్న కలెక్టర్ ఈ విషయం సిరికల్చర్ జెడితో సంప్రతించి ప్రభుత్వ దృష్టికి తెస్తానని తెలిపారు. రైతులు మాట్లాడుతూ ఇప్పటికి ఎన్నో సార్లు ఈ విషయం తెలియజేశామని ఇప్పటికైనా స్పందించాలని కోరారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణ ఆపాలి

**- జూన్ 22న విజయవాడ పాదయాత్రను జయప్రదం చేయండి**



నాయుడుపేట, జూన్ 18 ప్రభాతవార్త: మున్సిపల్ రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను తక్షణమే నిలిపివేయాలని, మున్సిపల్ కార్మికుల ఉద్యోగ భద్రతను కాపాడాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వచ్చే జూన్ 22, 2026న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త మున్సిపల్ కార్మికుల మహా పాదయాత్ర, ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ నాయుడుపేట మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ కార్మికుల మస్టర్ పాయింట్ వద్ద భారీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డీపల్లి చెంగయ్య మాట్లాడారు. మున్సిపాలిటీల్లో ప్రైవేటు శక్తులను ప్రోత్సహించడం వల్ల కాలగర్భంలో నలిగిపోతున్న కార్మికుల జీవితాలకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయుడుపేట మండల కార్యదర్శి ముకుంద, మున్సిపాలిటీ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, కాలేషా బాయ్, వెంకటాద్రి, సీనయ్యలతో పాటు నాయుడుపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఎన్ఎంఆర్ మరియు డైలీవేజ్ సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొని జై కార్మిక ఐక్యత జై సిఐటియు అంటూ నినాదించారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్ : సీఐ



నాయుడుపేట, జూన్ 18 ప్రభాతవార్త: పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను బేఖాతరు చేస్తూ, తమ వ్యక్తిగత వాహనాలకు అనధికారికంగా సైరన్లు అమర్చుకుని తిరిగే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్ ఉల్లంఘనలు, నిబంధనల అతిక్రమణలు ఎక్కువవుతున్న నేపథ్యంలో ఆయన స్థానిక ప్రజలకు, వ్యాపారస్తులకు పలు కీలక సూచనలు చేశారు. కొంతమంది తమ ప్రైవేట్ వాహనాలకు అనధికారికంగా పోలీస్ సైరన్లను వాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సీఐ తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, మోటార్ వాహనాల చట్టం ప్రకారం.. కేవలం పోలీసులు, అంబులెన్సులు, ఫైర్ ఇంజన్లు తప్ప ఇతర వ్యక్తులు ఎవరూ సైరన్లు వాడటానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజలందరూ పోలీసుల సూచనలను పాటించి రోడ్డు భద్రతకు సహకరించాలని కోరారు.

## కూటమి పాలనలో ప్రభుత్వ శాఖలన్నీ ప్రైవేట్ పరం



నాయుడుపేట, జూన్ 18 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్ని ప్రైవేటీకరణ చేసి ప్రజల బ్రతుకులను కార్పొరేటర్ల పాలు చేస్తున్నారని సిఐటియు నాయకులు శివకవి ముకుంద కూటమి పాలనపై ధ్వజమెత్తారు. 975, 673 జీవోలను రద్దు చేయాలనికోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్ ఎస్.కె పజిలుల్లాకు వినత పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కారిడార్ అధ్యక్షులు షేక్ అబ్దుల్లా, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు శివకవి ముకుంద మాట్లాడుతూ బిజెపి, టిడిపి, జనసేన పార్టీల కూటమి ప్రభుత్వంగా అధికారానికి వచ్చి రాష్ట్రాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ ప్రజల బ్రతుకులను కార్పొరేటర్ల కాళ్ళ కింద నలిపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిది కాంట్రాక్ట్ అంటూ కార్మికులపై, ప్రజలపై వేటు అన్నట్టుగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. అందులో భాగంగా 14 కీలక విభాగాలను పిపిపి పద్ధతిలో ప్రైవేటికరించాలని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడం అందుకు అనుగుణంగా జీవో నెంబర్ 975, 673 లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కార్మికులపై ప్రజల పై బారాల మోపి కాంట్రాక్ట్ జేబులు నింపుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్, పారిశుధ్య కార్మికులు, కంప్యూటర్ డిపార్ట్మెంట్, వాటర్ సెక్షన్ కార్మికులు, వీరాస్వామి, షేక్ కాలేషా, తేజ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## ఉత్తమ రైతు అవార్డు అందుకున్న నాగేంద్ర



దొరవారిసత్రం, జూన్ 18 ప్రభాతవార్త: నియోజకవర్గం దొరవారిసత్రం మండలం తని యాలి పంచాయతీ కమ్మ కండ్రిగ గ్రామంలో వేమసాని నాగేంద్ర నాయుడు అనే రైతు గత ఐదు సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నందున ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సాధికార సంస్థ ఉత్తమ ప్రకృతి వ్యవసాయ రైతుగా గుర్తించి తిరుపతి జిల్లాలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో జిల్లా బిజెపి అధ్యక్షులు శ్రీనివాసులు, నరేందర్ రెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం జిల్లా ఎంటి సత్యనారాయణ ఐసిఆర్‌పి నగేష్ ఆధ్వర్యంలో ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు.

## పొదుపు సభ్యులకు సమావేశాలు పరచాలి : డిపిఎం



వాకాడు, జూన్ 18 ప్రభాతవార్త : వాకాడు వెలుగు కార్యాలయంలో సీసీలు ఎలాంటి అవి నీతికి తావు లేకుండా పనిచేస్తూ, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ద్వారా పేద నిరుపేద పొదుపు సంఘాల సభ్యులు అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని డిపిఎం వనజాక్షి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో టిడిపి మండల కన్వీనర్ దువ్వూరు మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు వెలుగు సీసీలు అవినీతికి పాల్పడుతున్నారు అన్న ఫిర్యాదుతో జిల్లా అధికారుల సూచనల మేరకు ఎంపీడీవో సాయి ప్రసాద్ ఛాంబర్‌లో తిరుపతి జిల్లా వెలుగు సంబంధించిన అధికారులు విచారణ చేపట్టారు. జిల్లా విచారణ అధికారులు విచారణ మొదలుపెట్టారు, వెలుగు సిసిలు మానవత్వంతో ఆలోచించి ప్రభుత్వ నిబంధనలు తెలియజేసి సభ్యుల ద్వారా పని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీసీలు అవినీతికి పాలు పడితే నివేదికను జిల్లా కలెక్టర్కు అందిస్తామని హెచ్చరించారు. మండలంలోని పేద నిరుపేద కుటుంబాలకు అండగా ఉండి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను బ్యాంకు లోన్ ద్వారా అందించి వారి అభివృద్ధికి తోడ్పడాలని విచారణ చేపట్టిన అధికారులు సూచించారు. ఎంపీడీవో సాయి ప్రసాద్, మండల టిడిపి కన్వీనర్ మధుసూదన్ రెడ్డి సలహాలు సూచనలను తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం పోలమ్మ, సీసీలు, ప్రజలు ఉన్నారు.

## శివయ్య సేవలో నాసిక్ పీఠాధిపతి



శ్రీకాళహస్తి, జూన్18 ప్రభాతవార్త:శ్రీకాళహస్తీశ్వరాలయానికి గురువారం నాసిక్‌కు చెందిన స్వామి విదానందసరస్వతి మహామండలేశ్వర్ తన పరివారంతో స్వామి దర్శనానికి వచ్చారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు,ఎపిఆర్ఓ రవిలు వేదపండితులచే వేదమంత్రాలతో స్వాగతం పలికారు. స్వామి వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్‌లు పర్యవేక్షించారు

## గురువుకు ప్రత్యేక పూజలు అభిషేకాలు



శ్రీకాళహస్తి, జూన్ 18 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో క్షేత్రపాలకుడుగా వెలసి భక్తుల కొంగు బంగారంగా వరాలిస్తున్న గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హోమాలు, అర్చనలు, అలంకారాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో కార్యక్రమాలను నిర్వహించారు. వేదపండితులు వేద మంత్రాలను ఉచ్చరిస్తుండగా శాస్త్రోక్తంగా గురువుకు ఆరాధించారు. ధూప దీప నైవేద్యాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్‌లు పర్యవేక్షించారు.

# ఎమ్మెల్యే నానితో కలిసి చెక్కుల పంపిణీ చేసిన కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, జూన్ 18 ప్రభాతవార్త :



స్వర్ణముఖి నది ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం చెక్కుల పంపిణీని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నానితో కలిసి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పంపిణీ చేశారు. గురువారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్‌లో బాధిత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అందిన చెక్కులను పంపిణీ చేశారు. ముంతా తుపాన్ ప్రభావంతో 2025 అక్టోబర్ 24వ తేదీన తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామం సమీపంలోని స్వర్ణముఖి నదిలో చోటుచేసుకున్న విషాద ఘటనలో గల్లంతై మృతి చెందిన నలుగురు బాలుర కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయంలో మిగిలిన మొత్తానికి సంబంధించిన చెక్కులను నేడు అందించారు. స్వర్ణముఖి నదిలో జరిగిన ఈ దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఎన్. తేజ (18), ఎన్. బాలు (16)లతో పాటు ఎం. ప్రకాష్ (17), టి. మునిచంద్ర (15) గల్లంతయ్యారు. ఈ సంఘటన జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. అమాయక బాలుర మృతి పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ, చిన్న వయస్సులోనే పిల్లలను కోల్పోయిన కుటుంబాల బాధ వర్ణనాతీతమన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పరిహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి బాధిత కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు చేశారు. ఇందులో భాగంగా గతంలోఎన్. తేజ (18), ఎం. ప్రకాష్ (17), టి. మునిచంద్ర (15 )లకు చెందిన ఒక్కో కుటుంబానికి రూ.1.50 లక్షల చొప్పున పరిహారం అందజేయగా, వారికి చెల్లించాల్సిన మిగులు పరిహార మొత్తం రూ.50 వేల చొప్పున మూడు కుటుంబాలకు మరియు ఎన్. బాలు (16) కి చెల్లించాల్సిన రెండు లక్షల రూపాయల చెక్కులతో కలిపి మొత్తం రూ.3.50 లక్షల పరిహారాన్ని అందించడం ద్వారా ప్రభుత్వం ప్రకటించిన పూర్తి పరిహారం బాధిత కుటుంబాలకు అందించడం జరిగిందన్నారు. చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని మాట్లాడుతూ, బాధిత కుటుంబాల పట్ల ప్రభుత్వం అత్యంత సానుభూతితో వ్యవహరించిందన్నారు. కుటుంబ సభ్యులను కోల్పోయిన వారి మనోవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుందని, వారి సంక్షేమానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరఫున అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ తహశిల్దార్ జనార్ధన్, బాధిత కుటుంబ సభ్యులు ఎన్ మునస్వామి,ఎం. దేవి , టి.ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సారధి పోర్టల్ సమస్యలు పరిష్కారం..

### యథావిధిగా ఎల్ఎల్ఆర్ సేవలు

తిరుపతి రవాణ, జూన్ 18 ప్రభాతవార్త



రాష్ట్రవ్యాప్తంగా గత రెండు రోజులుగా సారధి పోర్టల్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలు పరిష్కారమవడంతో లెర్నర్స్ లైసెన్స్ (ఎల్ఎల్ఆర్) సేవలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయని జిల్లా రవాణా శాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. సాంకేతిక సమస్యల కారణంగా ఎల్ఎల్ఆర్‌కు సంబంధించిన సేవలు తాత్కాలికంగా నిలిచిపోవడంతో దరఖాస్తుదారులకు ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు, సాంకేతిక నిపుణుల సహకారంతో సమస్యలను పరిష్కరించడంతో గురువారం నుంచి అన్ని సేవలు పూర్తిస్థాయిలో పునరుద్ధరించబడ్డాయని తెలిపారు. ప్రస్తుతం సారధి పోర్టల్ సాధారణంగా పనిచేస్తోందని, లెర్నర్స్ లైసెన్స్ దరఖాస్తుల స్వీకరణ, పరీక్షల నిర్వహణ, అనుమతుల జారీ తదితర సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతున్నాయని వెల్లడించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్‌లకు సంబంధించిన డ్రైవింగ్ నైపుణ్య పరీక్షలు కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్లాట్‌లు బుక్ చేసుకున్న అభ్యర్థులు నిర్ణీత తేదీలు, సమయాలకు సంబంధిత పరీక్షా కేంద్రాలకు హాజరై పరీక్షల్లో పాల్గొనాలని సూచించారు. సాంకేతిక సమస్యల కారణంగా గత రెండు రోజులలో సేవలు పొందలేకపోయిన అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తమకు అనుకూలమైన తేదీల్లో కార్యాలయాన్ని లేదా ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు జిల్లా రవాణా శాఖ కట్టుబడి ఉందని, భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ పేర్కొన్నారు

## మానవత్వాన్ని చాటుకున్న టిడిపి నాయకుడు అంజిత్ బాషా

ఓబులవారిపల్లి, 18 జూన్ ప్రభాతవార్త



ఓబులవారిపల్లి మండలం ముక్కావారిపల్లి గ్రామం వద్ద హైవే రోడ్డులో బైకుపల్లి వెళుతున్న యువకుడు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలు పాలై ఉండడంతో కోడూరు వైపు వెళుతున్న టిడిపి నాయకులు జమీర్ అక్బర్ బాషా గమనించి అంబులెన్స్ ఫోన్ చేసి గాయపడ్డ అంబులెన్స్‌లో ఎక్కించి మానవత్వాన్ని చాటుకున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడినప్పుడు వారికి సహాయ సహకారాలు అందించాలని నలుగురు అభిప్రాయం వ్యక్తం చేశారు. కడప చెన్నై ప్రధాన రహదారులు తరచూ ప్రమాదాలు జరుగుతూ ఉంటాయని అధికంగా రోడ్డు గుంతలో ఉండడంతో హైవే రోడ్ల గుంతలు పూరచాలని ప్రజలు కోరుతున్నారు.

## పారదర్శకంగా 'సర్' ప్రక్రియ

### – కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సిపిఐ నాయకులు విజ్ఞప్తి




చిత్తూరుహెల్త్, జూన్ 18 ప్రభాతవార్త:

ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. సిపిఐ కార్యాలయంలో గురువారం ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియపై సిపిఐ నాయకులు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో సర్ ప్రక్రియ రాజకీయ జోక్యంతో జరుగుతున్నదని ఆరోపించారు. అధికార పార్టీ జరుగనున్న ఎన్నికల్లో ఎవరైతే తమ పార్టీకి ఓటు వేయరో అలాంటి వారి పేర్లను జాబితా నుండి తొలగించి ఎన్నికల్లో లబ్దిపొందడానికి ఈ ప్రక్రియ ద్వారా లబ్దిపొందడానికి ప్రయత్నం జరుగుతుందని అనుమానాలు వున్నాయన్నారు. ఓటర్ల సవరణలో అధికారులు ముస్లీం, క్రిస్టియన్లను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. దేశంలో ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, వెస్ట్ బెంగాళ్, బిహార్, అస్సాం రాష్ట్రాల్లో అర్హులైన ఓటర్లను అన్యాయంగా తొలగించారని ఆరోపించారు. చిత్తూరు జిల్లాలో సర్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు విసి గోపినాథ్, కె.మణి, దాసరి చంద్ర, కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా డాక్టర్ హేమలత

తిరుపతి విద్య జూన్ 18 ప్రభాత వార్త



తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా డాక్టర్ ఎస్. హేమలత నియమితులయ్యారు. ప్రస్తుతం కళాశాలలో సేద్య విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా, విభాగాధిపతిగా పనిచేస్తున్న ఆమెకు అసోసియేట్ డీన్ బాధ్యతలు అప్పగిస్తూ ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో గత 28 సంవత్సరాలుగా డాక్టర్ ఎస్. హేమలత వివిధ హోదాల్లో సేవలందించారు. పరిశోధన విభాగంలో 11 సంవత్సరాలు, విస్తరణ విభాగంలో ఐదేళ్లు, బోధన విభాగంలో 11 సంవత్సరాల అనుభవం కలిగి ఉన్న ఆమె సేవలను గుర్తించి విశ్వవిద్యాలయం ఈ బాధ్యతలు అప్పగించింది. గురువారం పూర్వపు అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. రెడ్డి శేఖర్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్. హేమలత మాట్లాడుతూ, తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలోనే డిగ్రీ, పీజీ విద్యను పూర్తి చేసి, అదే సంస్థలో అసోసియేట్ డీన్‌గా సేవలందించే అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వ్యవసాయ కళాశాల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, మరింత గుర్తింపు సాధనకు తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## టీటీడీ ఇన్‌చార్జి డీఈఓగా ఫణి కుమార్ నాయుడు

తిరుపతి విద్య, జూన్ 18 ప్రభాత వార్త



తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) ఇన్‌చార్జి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డీఈఓ)గా డి. ఫణి కుమార్ నాయుడుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన టీటీడీ డిప్యూటీ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో)గా విధులు నిర్వహిస్తు న్నారు. ప్రస్తుతం డీఈఓగా ఉన్న వెంకట సునీల్‌ను ఆయన మాతృశాఖ అయిన ప్రకాశం జిల్లాకు బదిలీ చేయడంతో, ఖాళీ అయిన డీఈఓ పదవికి డి. ఫణి కుమార్ నాయుడును ఇన్‌చార్జిగా నియమించారు. పూర్తిస్థాయి నియామకం జరిగే వరకు ఆయన ఇన్‌చార్జి డీఈఓగా విధులు నిర్వహించ నున్నారు. తిరుమలలో భక్తులకు అందించే సేవలు, వివిధ విభాగాల సమన్వయం, పరిపాలనా వ్యవహారాలు, అభివృద్ధి పనుల పర్యవేక్షణ బాధ్యతలను ఆయన నిర్వహించనున్నారు. కాగా, టీటీడీలో ఇప్పటికే డీఎఫ్‌వోగా పనిచేస్తూ పరిపాలనా అనుభవం సంపాదించిన ఫణి కుమార్ నాయుడుకు ఈ అదనపు బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## విద్యాసంస్థల బస్సులపై రవాణాశాఖ కొరడా...

### 15 వాహనాలపై కేసులు

తిరుపతి రవాణ, జూన్ 18 ప్రభాతవార్త




జిల్లాలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థలు, కళాశాలలకు చెందిన బస్సులపై జిల్లా రవాణాశాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహిం చింది. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘిం చిన 15 వాహనాలపై కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు. జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీ మోహన్ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి, పుత్తూరు, సూళ్లూరుపేట ప్రాంతాలతో పాటు తిరుపతి నగరంలోని అలిపిరి, చంద్రగిరి, రేణిగుంట రోడ్లలో ఈ తనిఖీలు చేపట్టారు. విద్యార్థుల రవాణా భద్రతను మరింత పటిష్టం చేయడం, మోటారు వాహన చట్టం నిబంధనల అమలును నిర్ధారించడం ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశ్యమని స్వర్ణలత తెలిపారు. ఈ సందర్భంగా బస్సుల పత్రాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పన్నుల చెల్లింపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరాలు, స్పీడ్ గవర్నర్లు తదితర భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. త్రైమాసిక పన్నులు చెల్లించకుండా నడుపుతున్న మూడు విద్యాసంస్థల వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా అగ్నిమాపక పరికరాలు లేకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, రాంగ్ డైరెక్షన్‌లో వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలకు సంబంధించి 12 వాహనాలపై కేసులు నమోదు చేసి, సంబంధిత యాజమాన్యాలపై మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అన్ని వాహనాలపై కలిపి రూ. లక్ష జరిమానా విధించినట్లు వెల్లడించారు. అలాగే విద్యాసంస్థల బస్సుల డ్రైవర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి, విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థల వాహనాలపై భవిష్యత్తులోనూ కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు.

# తిరుపతి డివిజన్

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్లో ప్రతి ఓటరు భాగస్వామి కావాలి...

### సర్‌ను పరిశీలించిన నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి శారదాదేవి

తిరుపతి కార్పొరేషన్, జూన్ 18 ప్రభాతవార్త:



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమంలో ప్రతి ఓటరు భాగస్వామి అయ్యేలా చర్యలు చేపట్టాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి శారదా దేవి తెలిపారు. నియోజకవర్గంలోని ఇందిరానగర్, బాలాజీ కాలనీ లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. పారదర్శకమైన తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష ్యంగా జూన్ 15 నుంచి కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓ) ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తారని తెలిపారు. ఓటర్లు ఫారాలను పూర్తిగా నింపి బీఎల్ఓలకు నేరుగా గానీ, బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) ద్వారా గానీ అందజేయవచ్చని, ఇంటర్నెట్‌పై అవగాహన ఉన్నవారు స్వయంగా ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చని తెలిపారు. ఈ మూడు విధానాల్లో ఏదో ఒక రూపంలో సమర్పించిన వారి పేర్లు నమూనా ఓటర్ల జాబితాలో చేర్చబడతాయన్నారు. ప్రభుత్వం సూచించిన 12 రకాల గుర్తింపు పత్రాలలో ఏదైనా ఒకటి సమర్పిస్తే వాటిని పరిశీలించి అర్హులైన వారి పేర్లను తుది ఓటర్ల జాబితాలో చేర్చడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా పేర్లు లేకపోవడం లేదా ఇతర అభ్యంతరాలు ఉన్నట్లయితే సంబంధిత వారికి నోటీసులు జారీ చేసి పూర్తి వివరాలు సేకరించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారు, ద్వంద్వ ఓటు నమోదులు కలిగిన వారు వంటి అనర్హుల పేర్లను తొలగించి ఓటర్ల జాబితాను రూపొందిస్తామని తెలిపారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లను గుర్తించి నమోదు చేయడంతో పాటు, వివాహం లేదా ఇతర కారణాల వల్ల నివాసం మారిన వారికి ఓటును కొత్త ప్రాంతానికి బదిలీ చేసే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. ఓటర్లకు ఎటువంటి సందేహాలున్నా సంబంధిత బీఎల్ఓ, ఏఈఆర్ఓ, ఈఆర్ఓ లను సంప్రదించాలని తెలిపారు. నేషనల్ ఓటర్స్ సర్వీస్ పోర్టల్, ఎన్నికల హెల్ప్‌లైన్ సేవలను కూడా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, బీఎల్ఓలు, బీఎల్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ బెటర్‌మెంట్‌లో ఎమరాల్డ్స్ విద్యార్థుల సత్తా

తిరుపతి విద్య, జూన్ 18 ప్రభాతవార్త



ఇంటర్మీడియట్ బోర్డు జూన్ 18న విడుదల చేసిన బెటర్‌మెంట్ ఫలితాల్లో తిరుపతిలోని ఎమరాల్డ్స్ జూనియర్ కాలేజీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో టాప్ ర్యాంకులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్లు ఇ. గిరిధర్, కె. విశ్వనాథ్ తెలిపారు. ఈ ఫలితాల్లో ఎం.ఇ.సి. విభాగానికి చెందిన సి. కుసుమాంజలి 500కి 497 మార్కులు సాధించి రాష్ట్ర టాప్ ర్యాంకర్‌గా నిలిచారు. అదే విభాగానికి చెందిన కె. సంయుక్త, పి. ప్రియదర్శిని చెరో 500కి 495 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అలాగే ఎం.పి.సి. విభాగానికి చెందిన ఎం. సంతోష్ 470కి 460 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో టాప్ ర్యాంకర్లలో ఒకరిగా నిలిచారు. విద్యార్థులు సాధించిన ఈ విజయంపై కళాశాల డైరెక్టర్లు హర్షం వ్యక్తం చేస్తూ, వారి కృషి, పట్టుదల, అధ్యాపకుల మార్గదర్శకత్వం ఫలితంగానే ఈ ఘన విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి కళాశాల ఖ్యాతిని మరింత పెంచిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. అలాగే వారి విజయానికి తోడ్పడిన అధ్యాపక బృందం, తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## డిగ్రీ 5వ సెమిస్టర్ ఫలితాలు విడుదల.

### అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఫలితాలు

తిరుపతి విద్య, జూన్ 18 ప్రభాత వార్త

ఎస్వీయూ పరిధిలో గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు డీన్ కె. సురేంద్రబాబు, పరీక్షల నియంత్రణాధికారి (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్) డాక్టర్ రాజా మాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు. ఫలితాలకు సంబంధించిన వివరాలు, మార్కుల సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ను మాత్రమే వినియోగించాలని అధికారులు పేర్కొన్నారు. అలాగే ఫలితాలపై ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత కళాశాలలు లేదా విశ్వవిద్యాలయ పరీక్షల విభాగాన్ని సంప్రదించాలని సూచించారు.

## రేపు ఎస్వీయూలో జాబ్ మేళా..

### 13 ప్రముఖ సంస్థలతో 1,100 ఉద్యోగ అవకాశాలు

తిరుపతి విద్య, జూన్ 18 ప్రభాతవార్త

ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో 13 ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొని సుమారు 1,100 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్‌తో పాటు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగార్థులు అవసరమైన విద్యార్హత పత్రాలు, బయోడేటా, ఇతర సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. జాబ్ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు పేర్కొన్నారు.

## సంస్కృత వర్శిటీలో ఏక్ పేడ్ మాకే నామ్ 2026 కార్యక్రమం..

### మొక్కలు నాటిన అధికారులు, అధ్యాపకులు

తిరుపతి విద్య జూన్ 18 ప్రభాత వార్త



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన ఏక్ పేడ్ మాకే నామ్2026 కార్యక్రమంలో భాగంగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ప్రాంగణంలో గురువారం మొక్కల నాటకం నిర్వహించారు. విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొని తల్లి పేరుతో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి దానిని సంరక్షి ంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్ల, రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణరావు, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొ. పి. వెంకట్రావు, స్కూల్ ఆఫ్ వేదవేదాంగ డీన్ ప్రొ. కృష్ణేశ్వర ఝా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొ. రమాకాంత్ మిశ్ర, ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్ ప్రొ. రాధా గోవింద త్రిపాఠి, ప్రొ. ఆర్. చంద్రశేఖర్, ప్రొ. జె.బి. చక్రవర్తి, డా. భరత భూషణ రథ్, డా. నిరంజన్ మిశ్ర, డా. యశస్వి, డా. జి. నాగలక్షి ్మ, డా. ఎన్. శ్రీనివాసరావు, డా. కె. సుజని పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఏక్ పేడ్ మాకే నామ్‌కోఆర్డినేటర్ డా. కనపాల కుమార్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు.

# 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా

## స్విమ్స్‌లో మెడిసిన్ విభాగం వారి ఆధ్వర్యంలో సెమినార్

తిరుపతి హెల్త్, జూన్ 18, ప్రభాతవార్త

శ్రీ వేంకట్వేర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) హాస్పిటల్ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సెమినార్‌ను ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా అనే నినాదంతో శ్రీ పద్మావతి ఆడిటోరియంలో నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రామ్ తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 21న యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఇందులో భాగంగా ఈ రోజు సెమినార్ను స్విమ్స్ జరుపుకుంటున్నామన్నారు. కరోనరీ ఆర్టరీ డిసీజ్ నివారణలో యోగా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల రక్తపోటు, కొలెస్ట్రాల్ అదుపులో ఉంటాయని, ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, కరోనరీ ఆర్టరీ డిసీజ్‌కు ప్రధాన కారణమైన ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తుందన్నారు. యోగా వల్ల ఒత్తిడి నివారించవచ్చునని, ప్రాణాయామం మరియు ధ్యానం చేయడం వల్ల మెదడు ప్రశాంతంగా ఉంచుకోవచ్చునని, కార్టిసాల్ (ఒత్తిడి హార్మోన్) స్థాయిలు తగ్గుతాయని పేర్కొన్నారు. యోగాసనాలు శరీరంలో రక్తప్రసరణను మెరుగుపరిచి, గుండెపై భారాన్ని తగ్గిస్తాయని చెప్పారు. మెడిసిన్ విభాగాధిపతి, సీనియర్ గ్రేడ్ ప్రొఫెసర్ డాక్టర్. అల్లాడి మోహన్ మాట్లాడుతూ జూన్ 7 నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమాలు యోగా ప్రాముఖ్యతను తెలియజేసే సెమినార్లు మరియు అవగాహన సదస్సులతో ఘనంగా కొనసాగుతున్నాయని, యోగా ఫర్ హెల్దీ ఏజింగ్ వంటి ప్రధాన సందేశంతో మెడిసిన్ ఈ సెమినార్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. స్విమ్స్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో స్విమ్స్ శ్రీ పద్మావతి హాస్పిటల్ మెడిసిన్ ఓ.పి నందు ప్రతి బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1:00 వరకు సమగ్ర యోగ జీవనశైలి వైద్య క్లినిక్ జరిగే పోస్టర్ ను స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ ప్రారంభించారు. ఎండోక్రైనాలజీ విభాగపు అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎస్.గాయత్రి మాట్లాడుతూ డయాబెటిస్ (మధుమేహం) నివారణలో యోగా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రోజూవారీ యోగాసనాలు మరియు ప్రాణాయామం చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని, ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుందని తెలియజేశారు. ఒత్తిడిని తగ్గించి హార్మోన్ల సమతుల్యతను కాపాడుతుందన్నారు. డయాబెటిస్ నియంత్రణకు, నివారణకు ఉపయోగపడే ముఖ్యమైన యోగాసనాలలో ముఖ్యమైనవి భుజంగాసనం, ధనురాసనం, మకరాసనాలని తెలిపారు. మెడికల్ ఆంకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. మౌర్య రెడ్డి మాట్లాడుతూ యోగా చికిత్స క్యాన్సర్ లక్షణాలను నియంత్రించడంలో సహాయపడటానికి నిర్దిష్టమైన, నియంత్రిత శ్వాస పద్ధతులను (ప్రాణాయామం) ఉపయోగిస్తుందన్నారు. ఏకాంతర నాసికా శ్వాస మరియు లోతైన ఉదర శ్వాస వంటి అభ్యాసాలు పారాసింపథెటిక్ నాడీ వ్యవస్థను ఉత్తేజపరుస్తాయని. ఇది చికిత్స సమయంలో మరియు తర్వాత ఒత్తిడి, అలసటను తగ్గించి, నిద్రలేమి సమస్యలను నివారించి, మొత్తం జీవన నాణ్యతను మెరుగుపరుస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డీన్ డాక్టర్. అలోక్ సచిన్, స్విమ్స్ రిజిస్ట్రార్ డాక్టర్. అపర్ణ ఆర్ బిట్లా,స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.రామ్, మెడిసిన్ విభాగాధిపతి సీనియర్ గ్రేడ్ ప్రొఫెసర్ డాక్టర్.అల్లాడి మోహన్, కార్డియాలజీ విభాగాధిపతి డా. వనజాక్షమ్మ, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్. ఎర్రంరెడ్డి, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్. సుధారాణి, ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డాక్టర్.మాధవి, స్విమ్స్ ఉద్యోగ సంఘ నాయకులు. పసల రామమూర్తి, ఎన్.వి.ఎస్ మురళీకృష్ణ, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

